క్లుప్తంగా

21న ఉద్యమకారుల ప్లీనరీ సమావేశం



శాయంపేట : ఈనెల 21న ఉద్యమకారుల ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గజ్జి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమావేశానికి ఉద్యమకారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్ పాడిశెట్టి గణేష్, నాయకులు బలిజె నర్సింహరాములు, గంట శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, దేవరాజ్, ఎండీ రఫీ, ప్రభాకర్, లింగమూర్తి, నాగరాజు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆత్మకూరు : మండలకేంద్రంలో ఇటీవల మృతి చెందిన తంగళ్లపల్లి చరణ్, కామారంలో మృతి చెందిన ఎలగొండ వనమాల కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కమలాపురం రమేష్, పరికిరాల వాసు, పర్వతగిరి రాజు, ఏరుకొండ రవీందర్‌గౌడ్, ఎండీ.ఖాజా పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆత్మకూరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కలిసి వర్గీకరణ సాధన కోసం కృషి చేసినందుకు గాను శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ గురించి సలహాలు తీసుకున్నారు. కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మంద రవి, నత్తి చందర్, నాగెల్లి రాజు, నత్తి కర్ణాకర్ ఉన్నారు.

అదుపు తప్పిన ఎలక్ట్రిక్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం



దామెర : ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఎలక్ట్రికల్ బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 26 మంది ప్రయాణికులు భారీ ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఏటురునాగారం నుంచి హనుమకొండకు వస్తున్న ఎలక్ట్రిక్ బస్సు దామెర మండలం ఒగ్లాపూర్ శివారులో జాతీయ రహదారిపై డీస్నీల్యాండ్ స్కూల్ ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోగా బస్సు రోడ్డు కిందకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ హాని జరుగలేదు. వరంగల్-2 డిపో మేనేజర్ వి జ్యోత్స్న, ఎలక్ట్రిక్ బస్సు టెక్నీషియన్లు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్ : మండలంలోని కమలాపూర్, ఉప్పల్ విద్యుత్ సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్, మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ శాఖ ఏడీఈ వంశీకృష్ణ, ఏఈలు రాములు, సంపత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కమలాపూర్, వంగపల్లి, గూడూరు, దేశరాజుపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 9:30 గంటల వరకు, ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పల్, భీంపల్లి, కన్నూరు గ్రామాల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- గత ప్రభుత్వంలో పాఠశాలకు మంజూరైన నిధులు
- బేస్‌మెంట్ వరకు కట్టి వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని పాలకులు



బేస్‌మెంట్ వరకు కట్టి వదిలేసిన కిచెన్‌షెడ్

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కనీస వసతులు లేకుండా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సుమారు రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సుమారు రూ.90 లక్షల పైచిలుకు నిధులతో మన ఊరు-మన బడి ప్రోగ్రాంలో ప్రభుత్వ పాఠశాలకు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణం పనులు మంజూరయ్యాయి. అయితే ఇట్టి పనులు చేయడానికి ముందుకు వచ్చిన ఓ కాంట్రాక్టర్ కేవలం కిషన్ షెడ్‌కు సంబంధించి బేస్‌మెంట్ వరకు కట్టి వదిలేశాడు. గతంలో మంజూరైన పనులు చేయడానికి అవకాశం ఉందా లేకపోతే మరోసారి ఎస్టిమేషన్లు తయారు చేసి నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలను ఆనుకుని 6 సంవత్సరాల క్రితం బీటీ రోడ్డు నిర్మాణం జరుగగా.. రోడ్డు ఎత్తుగా ఉండటంతో పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో వర్షాకాలం వరద నీరంతా పాఠశాలకు చేరుతుంది. నీరు బయటకు వెళ్లే మార్గం లేక వర్షాకాలం 4 నెలలు బురదతో పాటు దుర్గంధం వెలువడుతున్నప్పటికీ విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు, పాలకులు ముఖ్యంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టించుకుని పాఠశాల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రహరీ ఎత్తుగా నిర్మించాలి



పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాలి. వర్షాకాలంలో పాఠశాలలో నీరు నిలుస్తున్నందున ప్రహరీ ఎత్తుగా నిర్మించాలి. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించాలి

– గుడ్డేటి కృపాకర్, వెంకటాపూర్, గ్రామస్తుడు

అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కటాక్షపూర్‌లో మామిడితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కటాక్షపూర్‌లో ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మామిడి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించి బాధిత రైతులకు భరోసా కల్పించారు. అలాగే నీరుకుళ్ల శివారులో ప్రభుత్వ భూములను పరిశీలించారు. నిరుపేదలకు స్థలాన్ని పంపిణీ చేసి మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని అన్నారు. అలాగే నీరుకుళ్లలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ లైన్లను షిఫ్టింగ్ చేసే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1.41 కోట్ల ఎస్డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, పర్వతగిరి రాజు, అర్షం వరుణ్‌గాంధీ, ఏరుకొండ రవిందర్‌గౌడ్, ఎండి.ఖాజా, రజనీకర్ తదితరులు ఉన్నారు.

ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న నిట్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి

వేలేరు : విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని ఎన్ఐటీ ప్రొఫెసర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బీసీ గురుకుల పాఠశాలలో సృజనోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ అంశంలో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని అన్నారు. ఆది మానవుని జీవనం నుంచి ఆధునిక జీవితం వరకు సైన్స్‌లో జరిగిన పరిణామాలు శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితమేనని అన్నారు. శాస్త్రీయ ఫలాలు సామాన్యుని దరిచేరినప్పుడే శాస్త్రీయతకు అర్థం ఉంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు బయోలజికల్, ఫిజికల్ సైన్స్, ఓరగామి, డ్రాయింగ్ తదితర అంశాలను బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్, జేవీవీ జిల్లా కార్యదర్శి భిక్షపతి, జిల్లా నాయకులు సురేష్, దయాకర్, కుమారస్వామి, రాధాకృష్ణ, శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : కల్యాణలక్ష్మి, షాదిముబారక్ నిరుపేదలకు వరం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 52 లబ్ధిదారులకు రూ. 52,60, 320 విలువ గల కల్యాలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రజాప్రభుత్వంలో నిరుపేదలందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కల్వల సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఆర్ఐ రమేష్‌ఖన్నా, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చల్లా చక్రపాణి, ప్రకాశ్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలం



ఉపాధి కూలీలను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రాజేందర్

దామెర : ఫిష్‌బండ్ పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు నెల రోజులు కావస్తున్నా నేటికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ల్యాదెల్ల గ్రామంలోని చెరువులో ఫిష్‌బండ్ చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీ చేసిన డబ్బులు మాకు నెల రోజులైనా రావడం లేదని ఎలా బతకాలని ఆవేదన చెందుతున్నారని ఆయన తెలిపారు. మండుటెండల్లో కూలీలు పని చేస్తున్న కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అడ్మిషన్లు తీసుకోవాలి

హన్మకొండ: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి నుంచి అడ్మిషన్లు స్వీకరించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ కోరారు. 2025 – 2026వ విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ పిల్లలకు 3వ తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తామని స్కూల్ యాజమాన్యం చెబుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదని, ఎస్సీ విద్యార్థులు.. ఇతర విద్యార్థులతో పోటీ పడడం లేదని తప్పుడు కారణాలు చూపుతూ అడ్మిషన్లు నిరాకరిస్తోందని ఒక ప్రకటనలో తెలిపారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



బావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సింగిల్ విండో చైర్మన్ రవీందర్

ఎల్కతుర్తి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని బావుపేట, కోతులనడుమ, తిమ్మాపూర్, కేశవాపూర్ గ్రామాల్లో డి.విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు పండించి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం కల్పించే మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు కాగితాల శ్రీనివాస్, ముప్పు మహేందర్, నోడల్ ఆఫీసర్ అబ్జల్, సీఈవో తిరుపతి, తదితర రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

పరకాల : వేసవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పరకాల ఫైర్ ఆఫీసర్ భద్రయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పరకాల శివారులోని ఇండేన్ గ్యాస్ గోదాంలోని ఉద్యోగులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణ కోసం వాటర్ హైడ్రెన్స్, స్ప్రింక్లర్లు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఎల్ఎఫ్ కేవీఎస్ చారి, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా మొరం దందా

- అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నల్లకుంట చెరువులో తోడిన మట్టి

శాయంపేట : మండలంలో యథేచ్ఛగా మొరం దందాకు పాల్పడుతున్నారని, అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ హనుమకొండ జిల్లా సభ్యుడు మారెపల్లి సునీల్ శుక్రవారం జిల్లా నీటిపారుదల శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న నాగసముద్రం, తాళ్లకుంట, నల్లకుంట, దేవుని చెరువుల్లో అక్రమంగా రాత్రి వేళల్లో జేసీబీలు పెట్టి వందల ట్రాక్టర్లలో మట్టి మొరాన్ని తరలిస్తున్నారని తెలిపారు. అక్రమంగా మొరాన్ని తరలిస్తున్నా మండలంలో ఉన్న అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. తహసీల్దార్‌ను అడిగితే స్థానిక ఎమ్మెల్యే చెప్పారని మండలంలో ఎవరికైనా ఇళ్లలోకి మొరంను పోసుకోవడానికి కొండల్లో, గుట్టల్లో అనుమతులు ఇచ్చామని, చెరువుల్లో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారని పేర్కొన్నారు. అధికారుల అనుమతులు లేకుండా జేసీబీలు, ట్రాక్టర్లతో చెరువుల్లో అక్రమ మట్టి దందాకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

వేలేరు : ధర్మసాగర్ మండలంలోని దేవునూర్ ఇనుపరాతి గుట్ట భూముల అక్రమణపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవునూర్ ఇనుపరాతి గుట్టలోని అటవీశాఖ భూములను ఎమ్మెల్యే కడియం శ్రీహరి అక్రమంగా ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి చేసిన అబివృద్ధి ఏమిలేదని, ఘన్‌పూర్‌ను మున్సిపాలిటిగా చేసింది, వంద పడకల ఆస్పత్రి, 104 కోట్లతో సాగునీరు తీసుకువచ్చింది, డీగ్రీ కాలేజీ మంజూరు, ఇతర అభివృద్ధి పనులు చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై ఒక్కరోజు కూడా కడియం శ్రీహరి మాట్లాడలేదని, తన స్వప్రయోజనాల కోసమే పార్టీ మారాడని మండిపడ్డారు. అక్రమ కేసులు పెట్టి కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిందే కడియం శ్రీహరి అని అన్నారు. మండల కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరైతే ఇప్పటివరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాల నుంచి తెలంగాణను కాపాడుకుందాం

నయీంనగర్: దళారీ, వ్యాపార రాజకీయాల నుంచి తెలంగాణను కాపాడుకుందామని, కుటుంబ నిరంకుశ, ఆధిపత్య, వారసత్వ రాజకీయాలను రాష్ట్ర ప్రజలు ఇక భరించలేరని తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, రాష్ట్ర కన్వీనర్ పుల్లూరు సుధాకర్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుటుంబ వారసత్వ నిరంకుశ పాలన సాగించిన మాజీ సీఎం కేసీఆర్.. బాధిత, సామాజిక వర్గాలకు ఎల్కతుర్తి సభలో ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 1,560 మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న తెలంగాణను బీఆర్‌ఎస్ పాలనలో దొరల పాలు చేశారని ఆరోపించారు. సొంత సామాజిక వర్గానికి పదవులు, కాంట్రాక్టులు కట్టబెట్టి వ్యాపార దోపిడీని ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసి, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ధరణి పోర్టల్ రైతుల పాలిట శాపంగా మారిందని, 8వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వేదిక సభ్యులు సోమ రామమూర్తి, చిల్లా రాజేంద్రప్రసాద్, పల్లవు సమ్మయ్య, అశోక్, కృష్ణ, ప్రభాకర్ గౌడ్, ప్రవీణ్‌కుమార్, మంద వీరస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో గెస్ట్ హౌజ్‌లో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పృథ్వీ మాట్లాడారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, కేయూ ప్రధాన కార్యదర్శి కావ్య, ఉపాధ్యక్షురాలు అనూష, బాధ్యులు గణేష్, యాదగిరి, సాధన, లోకేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ధర్మసాగర్ మండలం తాటికాయలలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఎల్కతుర్తి : క్రైస్తవ మతస్తులు ఏసుక్రీస్తు సిలువను మోస్తుండగా భటులు ఏసుక్రీస్తును కొరడాలతో కొ డుతూ చిత్రహింసలు పెట్టిన తీరు పలువురిని ఆకట్టుకొని కంటతడి పెట్టించాయి. కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ చర్చి నుంచి బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి.

వేలేరు : పీచర గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి క్యాథలిక్ చర్చి వరకు 14 స్థలాల్లో క్రీస్తు మరణాన్ని తెలిపే ఘట్టాలను నాటిక ద్వారా ప్రదర్శిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఫాదర్ వై.కిరణ్ ఆధ్వర్యంలో క్రీస్తుశ్రమల రక్షణ యాత్రను నిర్వహించారు. ధర్మసాగర్ మండలంతో పాటు కరుణాపురం, తాటికాయల తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరుణాపురంలో ఫాదర్ సుధాకర్, తాటికాయలలో శరత్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్లు మాట్లాడుతూ ప్రభువు త్యాగాన్ని స్మరించుకునే రోజు గుడ్ ఫ్రైడే అని అన్నారు. ప్రతీ మనిషిలో ప్రేమ,సేవాభావాలు ఉండాలని అన్నారు.



వేలేరులో..



ఎల్కతుర్తిలో..

జరిమానా రద్దు చేస్తే బకాయిలు చెల్లిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

హన్మకొండ: జరిమానా రద్దు చేస్తేనే బకాయిలు చెల్లిస్తామని హౌజింగ్ బోర్డు వాసులు చెబుతున్నారని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు ధరావత్ భానునాయక్ తెలిపారు. హనుమకొండలోని హౌజింగ్ బోర్డులోని సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే చేశారు. ఈమేరకు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను నాయకులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భానునాయక్ మాట్లాడుతూ 30 ఏళ్లగా నివాసముంటున్న హౌజింగ్ బోర్డు కాలనీ ప్లాట్ల యాజమానులకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అధికారులు జరిమానా విధించారని అన్నారు.